ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

మంగళవారం 2 జనవరి 2024



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు - ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

మెరీనాతీరంలో కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్న క్షణాల్లో ప్రజల సంబరాలు

శాంథోమ్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో క్రైస్తవులు

అట్టహాసంగా ఆంగ్ల సంవత్సరాది వేడుకలు

- ప్రాణహాని లేని నూతన సంవత్సరాది
- పోలీసులకు రాష్ట్రప్రజల ప్రశంస

ప్యారీస్, జనవరి 1: కొత్త ఏడాదిలో అడుగుపెట్టామన్న ఉత్సాహంలో రాష్ట్రప్రజలు ఆంగ్ల నూతన సంవత్సరాదిని అట్టహాసంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ ప్రజానీకం సంతోషంతో గళమెత్తింది. చలి, మంచును సైతం లెక్కచేయకుండా నూతన సంవత్సరం వేడుకలను సముద్రతీరాల్లో, మారుమూల పల్లెల్లో ఉత్సాహంగా జరుపుకున్నారు. మరి కొంతమంది భక్తి భావంతో ఆలయాలకు తరలివెళ్లి స్వామివార్లను దర్శనం చేసుకొని పులకించిపోయారు. ఇక, చర్చిల్లో ఆదివారం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటిగంట వరకు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పాల్గొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ సంస్థ అర్ధరాత్రి ఒంటిగంట వరకు ప్రత్యేక రైళ్లు, మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్... ఆలయాలు, చర్చీలు, పర్యాటక ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపాయి. ఇదిలా ఉండగా, గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ ఉత్తర్వుల మేరకు చెన్నైలో ఎలాంటి అవాంఛనీయ సంఘటను జరగకుండా, ముఖ్యంగా ప్రాణ హాని కలిగించే ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక పోలీసులు, సైబర్ క్రైం, ట్రాఫిక్ విభాగం, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, నార్కోటిక్ బృందాలు విధుల్లో పాల్గొని ప్రజలకు రక్షణ కవచంగా నిలిచారు.

న్యూ ఇయర్ బేబీస్

ప్రభుత్వాసుపత్రుల్లో 29 మంది జననం

చెన్నైలోని ప్రభుత్వాసుపత్రుల్లో నూతన సంవత్సరంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు 29 మంది పిల్లలు జన్మించారు. ఎగ్మూర్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో 9 మంది జన్మించగా, వీరిలో ఐదుగురు మగ శిశువులు. ట్రిప్లికేన్ ప్రభుత్వ కస్తూర్బా గాంధీ ఆసుపత్రిలో ఆరుగురు శిశువులు జన్మించగా, వీరిలో ముగ్గురు మగపిల్లలు, ముగ్గురు ఆడశిశువులు. కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రిలో జన్మించిన నలుగురిలో ఆడశిశువు ఉంది. అలాగే, రాయపురంలోని ప్రభుత్వ ఆర్‌ఎస్‌ఆర్‌ఎం ఆసుపత్రిలో జన్మించిన పదిమంది శిశువుల్లో ఆరుగురు మగ పిల్లలు కాగా, నలుగురు ఆడపిల్లలు జన్మించినట్లు ఆయా ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

నేడు తిరుచ్చికి ప్రధాని



విమానాశ్రయ కొత్త టెర్మినల్ ప్రారంభోత్సవం - రాష్ట్ర బీజేపీ నేతలతో ప్రత్యేక భేటీ

31 మంది ముఖ్యులకు ఆహ్వానం - కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా రాక

చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మితమైన కొత్త టెర్మినల్‌ను ప్రారంభించేందుకు మంగళవారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానున్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ రాష్ట్ర నాయకులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. లోక్‌సభ ఎన్నికల వ్యూహరచనపై ఆయన పార్టీ నిర్వాహకులతో సమీక్ష జరపనున్నారు. ఇందుకోసం ఇప్పటికే 31 మంది ముఖ్యనేతలకు ఆహ్వానాలు వెళ్లాయి. కేంద్రంలో బీజేపీ బలంగా కనిపిస్తున్నప్పటికీ రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్న విషయం తెలిసిందే. మొన్నటి వరకూ బీజేపీతో కలిసి సాగిన అన్నాడీఎంకే దూరంగా జరిగింది. దీంతో చిన్నాచితకా పార్టీలతో కలిసిఎన్నికలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి బీజేపీకి తప్పనిసరైంది. అయితే దక్షిణాదిలోనూ పట్టు నిలుపుకోవాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ అధిష్ఠానం తమిళనాడు నుంచి కనీసం రెండు స్థానాలనైనా సాధించాలని తలపోస్తోంది. ఇందుకోసం ఇప్పటి నుంచే బీజేపీ అధిష్ఠానం వ్యూహాలు రచిస్తోంది. ఇందులో భాగంగా తిరుచ్చి విమానాశ్రయ కొత్త టెర్మినల్ ప్రారంభోత్సవంకోసం వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. రాష్ట్రనేతలతో భేటీ కానున్నారు. వారికి ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. ఈసందర్భంగా మోదీ పలువురు సీనియర్లతోనూ విడివిడిగా మాట్లాడనున్నట్లు సమాచారం. కూటమి నుండి అన్నాడీఎంకే వైదొలగిన నాలుగునెలల తర్వాత తొలిసారి ప్రధాని మోదీ మంగళవారం ఉదయం రాష్ట్రంలో పర్యటించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం ఆయన తిరుచ్చికి విచ్చేయనున్నారు. డీఎంకే వంటి ప్రధాన పార్టీలు బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కనుక వచ్చే లోక్‌సభ ఎన్నికలు రాష్ట్ర బీజేపీకి ఓసవాలు లాంటిదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

బీజేపీ నేతలతో భేటీ...

ప్రధాని మోదీ ప్రభుత్వ కార్యక్రమాల కోసం వస్తున్నప్పటికీ రాష్ట్ర బీజేపీ నేతలతోనూ భేటీ కానున్నారు. రాష్ట్ర బీజేపీకి వున్న బలాలు, బలహీనతలపై ఇప్పటికే సమాచారం తెప్పించుకున్న మోదీ.. వాటిపై రాష్ట్ర నేతలతో చర్చించనున్నట్లు తెలిసింది. తిరుచ్చి ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలో ఉన్న స్టార్‌హోటల్‌లో ఏర్పాటయ్యే ఈ సమావేశానికి రమ్మంటూ ఇప్పటికే 31 మందికి ఆహ్వానాలు అందాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, వ్యవస్థాపక కార్యదర్శి కేశవ వినాయగన్, కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్, హెచ్.రాజా, డిప్యూటీ అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్, ఎం.చక్రవర్తి, కరు నాగరాజన్, కరుప్పు మురుగానందం, శీనివాసన్, వీపీ దురైసామి, శాసనసభ్యులు ఎంఆర్ గాంధీ, డాక్టర్ సరస్వతి సహా 31 మంది ఈ సమావేశంలో పాల్గొంటారు. కూటమి నుంచి అన్నాడీఎంకే వైదొలగిన నేపథ్యంలో రాష్ట్రంలో బీజేపీ బలం ఎలా ఉంది? లోక్‌సభ ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తుపెట్టుకోకుండా పోటీ చేస్తే ఎలా ఉంటుంది? ప్రజల మద్దతు ఎలా ఉంది? వంటి అంశాలపైనా మోదీ చర్చించే అవకాశం ఉంది. ఆ తర్వాత కొన్ని కార్యాచరణ పథకాలు, ఎన్నికల వ్యూహరచనలు గురించి ఆయన పార్టీ నిర్వాహకులకు వివరించనున్నారు. ఈ సమావేశం ముగియగానే మోదీ తిరుచ్చి నుంచి లక్ష్యద్వీపాలకు బయలుదేరి వెళతారు. ఈ భేటీలో కేంద్ర మంత్రి అమిత్‌షా కూడా పాల్గొంటారని తెలిసింది. ప్రధాని కార్యక్రమాలు ముగిసిన తర్వాత కూడా మధ్యాహ్నం 2.30 గంటలకు పార్టీ రాష్ట్ర శాఖ నిర్వాహకులు, జిల్లా నేతల సమావేశం కూడా జరుగనుంది. అన్నామలై అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశంలో ప్రధాని మోదీ సూచనలను వివరించనున్నారు. ప్రధాని మోదీ రాకను పురస్కరించుకుని తిరుచ్చి నగరంలో బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా ప్రధాని రాకను పురస్కరించుకుని తిరుచ్చి నగర వ్యాప్తంగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తిరుచ్చి ఎయిర్‌పోర్ట్ కొత్త టెర్మినల్ ప్రారంభోత్సవం

తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయ స్థాయి పెంచుతూ నూతనంగా రూ.1,200కోట్లతో నిర్మించిన కొత్త టెర్మినల్‌ను మంగళవారం ఉదయం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధానితోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విచ్చేయనుండటంతో పోలీసుల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఐదంచెల భద్రతా ఏర్పాట్లు కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా మంగళవారం ఉదయం 10 గంటలకు తిరుచ్చి చేరుకుంటారు. ముందుగా విమానాశ్రయం నుంచి ఉదయం 10.30 గంటలకు ప్రధాని మోదీ భారతిదాసన్ యూనివర్శిటీలో జరిగే స్నాతకోత్సవాల్లో పాల్గొని విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. ఆతర్వాత అక్కడినుంచి 11.45 గంటలకు బయల్దేరి 12 గంటలకు తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారు. విమానాశ్రయాన్ని ప్రారంభించడంతో పాటు కొత్త పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. అటుపిమ్మట స్టార్‌హోటల్‌లో పార్టీ నిర్వాహకులతో సమావేశమవుతారు.

పర్యటన ఇలా...

మంగళవారం ఉదయం 10.30 గంటలకు తిరుచ్చి భారతిదాసన్ విశ్వవిద్యాలయంలో జరిగే 38వ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొని విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరుచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.1200 కోట్లతో నిర్మించిన కొత్త టెర్మినల్‌ను ప్రారంభించనున్నారు. ఆ సభలో రూ.19,850 కోట్ల విలువైన వివిధ పథకాలను కూడా ఆయన ప్రారంభించనున్నారు. అంతేగాక ఇప్పటికే పూర్తయిన వివిధ పథకాలను కూడా ఆయన ప్రారంభిస్తారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, గవర్నర్ ఆర్ఎన్ రవితో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు.

జల్లికట్టు ఎద్దుల కొమ్ములకు రబ్బరు కవచాలు

ఐసిఎఫ్, జనవరి 1: జల్లికట్టు ఎద్దులను లొంగదీసుకొనే సాహసవంతులు గాయపడకుండా ఉండేలా కొమ్ములకు రబ్బరు కవచాలు తయారయ్యాయి.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350కి పైగా ప్రాంతాల్లో సంక్రాంతిని పురస్కరించుకొని జల్లికట్టు పోటీలు జరగనున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 50 నుంచి 60 ఎద్దులు మాత్రమే పోటీల్లో పాల్గొనాలి. అయితే అలంగానల్లూర్, పాలమేడు, అవనియాపురంలో జరిగే పోటీల్లో 600కు పైగా ఎద్దులను బరిలో దించుతున్నారు. 2022లో జరిగిన పోటీల్లో 9 ఎద్దులు, 950 మంది క్రీడాకారులు గాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 350 పోటీల్లో మొత్తం 8,000 మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది జరగనున్న జల్లికట్టు పోటీల్లో ముందస్తు భద్రతా చర్యలుగా ఎద్దుల సంఖ్య తగ్గించడంతోపాటు వాటికొమ్ములకు రబ్బరు, దృఢమైన ప్లాస్టిక్‌తో రూపొందించిన సురక్షితకవచం అమర్చేందుకు ప్రభుత్వం, జంతు సంక్షేమ బోర్డు నిర్ణయించాయి. ఆ ప్రకారం రూపొందించిన కవచాలను అవనియాపురంలో 15వ తేదీ, పాలమేడులో 16వ తేది, అలంగానల్లూర్‌లో 17వ తేదీల్లో జరిగే పోటీల్లో వీటిని ఉపయోగించనున్నారు.



తేదీల్లో జరిగే పోటీల్లో వీటిని ఉపయోగించనున్నారు.

ఇరు రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడతా!

తమిళ మత్స్యకారుల దాడులపై కేంద్రమంత్రి పురుషోత్తం



మత్స్యకారులకు చెక్కు అందజేస్తున్న పురుషోత్తం రూపాలా

బిట్రగుంట, జనవరి 1: తమిళనాడు మత్స్యకారుల దాడులు, మత్స్య సంపద దోపిడీపై ఆ రాష్ట్ర ప్రభుత్వంతోపాటూ ఏపీ ప్రభుత్వంతోనూ మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల మంత్రి పురుషోత్తం రూపాలా స్పష్టం చేశారు. నెల్లూరుజిల్లా బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌లో సోమవారం 10వ సాగర పరిక్రమ కార్యక్రమం జరిగింది. నౌకాయానషిప్‌లో వచ్చిన కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల దంపతులకు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆప్కాబ్ ఛైర్మన్ అనిల్‌బాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో గంగపుత్రుల సమస్యలను ఎమ్మెల్యే, మత్స్యకార నేత గోవిందస్వామి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా పురుషోత్తం రూపాలా మాట్లాడుతూ.. ఫిషింగ్ హార్బర్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. హార్బర్‌నిర్మాణంలో కొద్దిపాటి మార్పులు,పొడిగింపు సహా తుఫాన్ వంటి ప్రకృతి విపత్తుల్లోబోట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్యలు తీసుకుంటామన్నారు. బోట్లు నిలిచేందుకు మరోవైపు ప్లాట్‌ఫాం ఏర్పాటు విషయమై అధికారులతో మాట్లాడతామని చెప్పారు. ఇక తమిళనాడులోని కడలూరు ప్రాంత మత్స్యకారుల దాడులు, ఆంధ్రలోని మత్స్యసంపద దోచుకుపోవడంపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మత్స్యకారులకు రాయితీరుణాల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ కమిషనర్ కన్నబాబు, జేడీ నాగేశ్వరరావు, జేసీ కూర్మనాథ్, తహసీల్దారు హేమంత్‌కుమార్, సర్పంచు అంకమ్మ, బీజేపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు కూలి నలుగురి దుర్మరణం

తిరుచ్చిలో విషాదం



కూలిన ఇంటి పైకప్పును పరిశీలిస్తున్న పోలీసులు

పెరంబూర్, జనవరి 1: కొత్త సంవత్సరం అడుగిడుతున్న క్షణాల్లో యాభయ్యేళ్లక్రితం నాటి ఇంటి పైకప్పు కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నిద్రలోనే ప్రాణాలు విడిచారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక తిరుచ్చిలో ఈ ఘటన జరిగింది. అరియమంగళం కీళఅంబికాపురానికి చెందిన ఆటో డ్రైవర్ మారిముత్తు తిరుచ్చిలో తల్లి శాంతి(70), భార్య విజయలక్ష్మి(38), కుమార్తెలు ప్రదీప(12), హరిణి(10)తోకలసి నివసిస్తున్నాడు. అక్క భర్త మృతిచెందడంతో ఆదివారం మారిముత్తు చెన్నైకి వెళ్లినట్లు సమాచారం. దీంతో ఆదివారం ఇంట్లో నలుగురు నిద్రిస్తుండగా పైకప్పు కూలిపడింది. ఈ ఘటనలో శాంతి, విజయలక్ష్మి, ప్రదీప, హరిణి శిథిలాల కింద చిక్కుకొని మృతిచెందారు. అర్ధరాత్రి కావడంతోకూలిన విషయం చుట్టుపక్కలవారు గుర్తించలేకపోయారు. తెల్లవారుజామున పక్కింటి మహిళ గమనించి అరియమంగళం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించింది. ఇన్‌స్పెక్టర్ తిరువానందం సిబ్బందితో చేరుకొని, పరిస్థితి గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని శిథిలాలు తొలగించి మృతదేహాలను తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 1972లో నిర్మితమైన ఆ ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఇప్పుడు కుప్పకూలిందని పోలీసులు తెలిపారు.

నేటినుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ఐసిఎఫ్, జనవరి 1: అర్ధవార్షిక సెలవులు ముగిసి ఈనెల 2న మంగళవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. 6 నుంచి 12వ తరగతి వరకు అర్ధవార్షిక పరీక్షలు ముగిసి గత నెల 23 నుంచి సోమవారం వరకు క్రిస్మస్, న్యూ ఇయర్ సెలవులు ప్రకటించారు. సెలవు ముగిసిన నేపథ్యంలో, మంగళవారం నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో, వేళచ్చేరిలోని ప్రభుత్వ పాఠశాలను సోమవారం పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలు ప్రారంభమైన వెంటనే సెమిస్టర్ పుస్తకాలను విద్యార్థులకు అందిస్తామన్నారు. భారీవర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న తిరునల్వేలి జిల్లాలో మంగళవారం నుంచి అర్ధవార్షిక పరీక్షలు జరుగుతాయన్నారు. అలాగే, వరదల్లో నష్టపోయిన విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య, నోటు పుస్తకాలు అందిస్తామన్నారు. అదే సమయంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో 10, ప్లస్‌వన్, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో, సకాలంలో సిలబస్ పూర్తిచేసి, విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యేలా వారిని మానసికంగా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించినట్టు మంత్రి తెలిపారు.



వేళచ్చేరిలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

అన్నమయ్య తొలి గురువు అలివేలుమంగ

- ఆచార్య పప్పు వేణుగోపాల రావు
- అలరించిన కళాసుధ సంక్రాంతి సంబరాలు



ఆచార్య పప్పు వేణుగోపాలరావును సత్కరిస్తున్న శ్రీకళాసుధ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్, ఆచార్య సీఎంకే రెడ్డి

అడయార్, జనవరి 1: భక్త రామదాసు దృష్టిలో భద్రాద్రి రాముడు మాత్రమే శ్రీరామచంద్రుడని, అన్నమయ్య దృష్టిలో శ్రీవేంకట రమణుడు ఒక్కడే వేంకటేశ్వర స్వామి అని ఆచార్య పప్పు వేణుగోపాల రావు అన్నారు. నగరానికి చెందిన శ్రీకళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 1న నూతన సంవత్సర, సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక టీ.నగర్‌లోని ఆంధ్ర సోషల్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) గోదావరి హాలులో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 8గంటల వరకు ఈ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలు తొలుత ఘంటసాల సావిత్రి ప్రార్థనా గీతంతో ప్రారంభం కాగా, కుమారి తనుష్క కూచిపూడి నృత్యం, కుమారి నందిత కన్నన్ కీర్తనలు సభికులను అలరించాయి. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభ ఉపన్యాసం చేయగా, ఆచార్య పప్పు వేణుగోపాల రావు 'తిరుమల వైభవం, అన్నమయ్య అనుభవం' అనే అంశంపై చేసిన ప్రసంగం సభికులంతా భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ముఖ్యంగా, ఏడుకొండలకు సంబంధించిన ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ఆయన ప్రసంగం ప్రారంభించి, 'తిరుమల వైభవం - అన్నమయ్య అనుభవం' అనే అంశంపై శ్రవ్య, దృశ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. తన ప్రసంగంలో శ్రీవారి ఆలయ నిర్మాణంతో పాటు ఆలయ ప్రాశస్త్యం, శ్రీవారికి జరిగే పూజా విధానం, నిర్వహించే సేవలు, శ్రీవారి సన్నిధిలో ఉన్న ఇతర విగ్రహ మూర్తుల వివరాలు ఇలా ప్రతి అంశాన్ని విపులీకరించారు. అలాగే, అన్నమయ్య పుట్టుపూర్వోత్తరాలు, ఆయన తిరుమల కొండను ఏ వయస్సులో దర్శించింది, ఆయన భక్తి తదితర అంశాలను దృశ్యరూపకంగా వివరించారు. అన్నమయ్య తన 16వ యేటనే తిరుమల కొండను అధిరోహించారని, ఆయన తొలి గురువు అలివేలుమంగ అని పేర్కొన్నారు. అన్నమయ్య తన ఇష్టదైవమైన వేంకటరమణుడిపై 32 వేల కీర్తనలు రాయగా, వాటిలో ప్రస్తుతం 14 వేల పైచిలుకు కీర్తనలు మాత్రమే ఉన్నాయన్నారు. శ్రీవారిపై అన్నమయ్యకు అనన్యమైన భక్తిప్రపత్తులు ఉన్నాయన్నారు. ఆయన దృష్టిలో ప్రతి దైవ స్వరూపం వేంకటేశరమణుడే అని చెప్పారు. అలాగే, భక్తరామదాసు కూడా ఈ కోవకు చెందిన భక్తుడేనన్నారు. ఈయన దృష్టిలో కూడా భద్రాద్రి రాముడు ఒక్కడే శ్రీరాముడు అని పేర్కొన్నారు. వీరిద్దరు వారివారి ఇష్టదైవాలపై అపారమైన మూఢభక్తిని కలిగివున్నారు. ఇదిలావుంటే, విశాఖపట్నం చైతన్య సోదరులు, వి.వెంకటేశ్వర శర్మ, బి.కృష్ణమాచార్యులు సంకీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి టీఎస్ శేషాద్రి (వయోలిన్), వి.శాంతికళాధర్ (మృదంగం) వాద్య సహకారం అందించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా, ప్రత్యేక ఆకర్షణగా ముగ్గులపోటీలు (పూలతో మాత్రమే), శాకాహార వంటల పోటీలు, సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. వంటల పోటీల్లో విజయలక్ష్మి, రాజేశ్వరి, ముగ్గుల పోటీల్లో జాహ్నవి, రాజేశ్వరి విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమం అనంతరం శ్రీవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న తనుష్క

సమాచార దర్శిని

రాష్ట్రంలో 28 కరోనా కేసులు

పెరంబూర్, జనవరి 1: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 831 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, 28 మంది నిర్ధారణ అయ్యింది. వారిలో చెన్నైలో 16 మంది, చెంగల్పట్టులో ముగ్గురు, కోవై, మదురైలో తలా ఇద్దరు, నీలగిరి, తిరువళ్లూర్, కన్నియాకుమారి, తిరువణ్ణామలై, తిరువారూర్ జిల్లాలో తలా ఒకరికి కరోనా లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. అలాగే, చికిత్సలు పొంది 29 మంది డిశ్చార్జ్ కాగా, చెన్నైలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 44 ఏళ్ల మహిళ మృతి చెందింది. ప్రస్తుతం పలు ఆసుపత్రుల్లో 175 మంది చికిత్సలు పొందుతున్నట్లు ఆరోగ్యశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

పెరిగిన బియ్యం ధరలు

ఐసిఎఫ్, జనవరి 1: రాష్ట్రవ్యాప్తంగా బియ్యం ధరలు పెరిగాయి. తిరుచ్చి జిల్లాలో వరి దిగుబడులు తగ్గడంతో ధరలు 20శాతం పెరిగాయి. తిరుచ్చి మనచ్చి నల్లూర్, అరియమంగళం, కాట్టూరు ప్రాంతాల్లో ఉన్న బియ్యం మిల్లులకు ఈప్రాంతాల నుంచే కాకుండా తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, కావేరి డెల్టా జిల్లాల నుంచి బియ్యం దిగుమతి అవుతోంది. అలాగే, కర్ణాటక నుంచి వచ్చే వడ్లను బియ్యంగా మార్చి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రస్తుతం పొరుగు రాష్ట్రాల నుంచి తక్కువ లోడుతో ధాన్యం దిగుమతి అవడంతోపాటు తిరుచ్చి మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా బియ్యం ధరలు పెరిగాయి. గత ఏడాది జనవరిలో కర్ణాటక పొన్ని బియ్యం కిలో రూ.46 విక్రయం కాగా, చిల్లర విక్రయాల్లో రూ.55 నుంచి రూ.60వరకు ధర నిర్ణయించారు. అలాగే, మనచ్చి నల్లూర్ పొన్ని కిలో రూ.65, సాధారణ బియ్యం రూ.40 నుంచి రూ.51సహా అన్నిరకాల బియ్యంధరలు పెరిగాయి.

ఆన్‌లైన్ సేవలు పరిచయం చేసిన ఐఓబీ

ఐసిఎఫ్, జనవరి 1: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) వినియోగదారుల సౌకర్యార్థం పోర్టబులిటీ ఆన్ లైన్ పొదుపు ఖాతా ప్రారంభించింది. మారుతున్న కాలానికి అనుకూలంగా ఖాతాదారుల కోసం డిజిటల్ బ్యాంక్ సేవలను అమలుచేస్తోంది. ఈ నేపథ్యంలో, పోర్టబులిటీ ఆన్‌లైన్ పొదుపు ఖాతాను ఖాతాదారులు వినియోగించేందుకు బ్యాంక్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ సేవింగ్స్ అకౌంట్'ను ఎంపిక చేసి, బ్యాంక్ ఖాతాతో నమోదు చేసిన మొబైల్ నెంబరును నమోదుచేసి, వచ్చిన ఓటీపీ నెంబరును క్లిక్ చేస్తే అందులో ఖాతా నెంబరు, పేరు, బ్యాంక్ శాఖ అనే వాటిని ఖరారు చేసి ఫారాన్ని సమర్పించాలి. ఈ సేవల ద్వారా సులభతరంగా పరివర్తనలు, ఇతర సేవలు పొందవచ్చని అధికారులు తెలిపారు.

ఆరేళ్లలో 44 లక్షల మందికి కుక్కకాటు

ఐసిఎఫ్, జనవరి 1: రాష్ట్రంలో ఆరేళ్లలో పిచ్చికుక్క కాటుకు 44 లక్షల మంది గురైనట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. రేబిస్ వ్యాధి టీకాల ద్వారా నిరోధించగలిగే జెనెటిక్ వైరస్ అని, ఇది అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అని, ప్రపంచస్థాయిలో 150 దేశాల్లో 59 వేల మంది మరణించారని తెలిపారు. అందులో మూడువంతుల్లో ఒక భాగం భారతదేశంలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 2022లో మాత్రమే 8.83 లక్షల మంది కుక్కకాటుకు గురికాగా, 2018-23 వరకు 44,10,964 మంది కుక్కకాటుకు గురయ్యారని తెలిపారు. అలాగే, 2018-22 వరకు రేబిస్ వ్యాధితో 129 మంది మృతి చెందారన్నారు. స్థానిక స్టాన్లీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రుల్లో 6,000 మంది చికిత్సలు పొందారని, 2030 నాటికి రాబిస్ రహిత తమిళనాడుగా మార్చేందుకు చర్యలు చేడతామని అధికారులు తెలిపారు. కుక్క కరిచిన వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని, గాయమైన ప్రాంతాన్ని 15 నిమిషాలు సబ్బుతో శుభ్రం చేయాలని, దీని ద్వారా 80 శాతం రేబిస్ వైరస్ నిర్మూలించబడుతుందన్నారు. వైద్యుల సలహా మేరకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని, ఎలాంటి మూలికలు, సొంత వైద్యం పనికిరాదని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జనవరి 1: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా స్థానిక వ్యాసర్పాడి పరిధిలోని సీఎంబీటీటీ, తట్టాన్‌కుళం రోడ్డు, తారాబంద్ అపార్ట్‌మెంట్, సీతాపతి 1 నుంచి 21 వీధులు, షణ్ముగసుందరం నగర్, ఎమ్మార్‌హెచ్ రోడ్డు, లోటస్ కాలని 1,2,3 వీధులు, స్వామినగర్, సీఎండీఏ, దేవరాజ్ నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు తెలిపింది.

ఆధార్ కార్డు ద్వారా వేతనం బట్వాడా

ఐసిఎఫ్, జనవరి 1: వంద రోజుల ఉపాధి హామీ పథకం కూలీలకు ఆధార్ కార్డు ద్వారా కూలి బట్వాడా చేసే ప్రక్రియ సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులున్నారు. ఆధార్ అనుసంధానం చేసిన కార్మికులకు వేతనం నేరుగా అందించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి పథకం కార్డుతో ఆధార్ అనుసంధానం చేసేందుకు గత ఏడాది ఐదు సార్లు అవకాశం కల్పించగా, ఈ గడువు ఆదివారంతో ముగిసింది. మూడేళ్లలో ఒకరోజైనా పనిచేసి ఉంటే వారు విధుల్లో ఉన్నట్లు పరిగణించబడతారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన ఈ ప్రక్రియ ప్రకారం నమోదు చేసిన 25.25 కోట్ల మంది కార్మికుల్లో 14.35కోట్ల మంది మాత్రమే అర్హులుగా గుర్తించారు. రాష్ట్రప్రభుత్వాలకు కేంద్రం పంపిన సర్క్యులర్‌లో... అర్హత ఉండి నమోదు చేయని వారిని మళ్లీ పథకంలో చేర్చాలని పేర్కొంది. గత 21 నెలల్లో 7.6 కోట్ల మంది పేర్లు తొలగించగా, వారు ఆధార్ నెంబరు అనుసంధానం చేస్తే, వారి ఖాతాకు వేతనం జమ అవుతుంది. సోమవారం నుంచి ఆధార్‌నెంబరు నమోదుచేసుకున్న వారికి వేతనం బట్వాడా అమలుకు వచ్చింది.

కిళంబాక్కం నుంచి 2,900 ఎంటీసీ బస్సులు

పెరంబూర్, జనవరి 1: నగర శివారు ప్రాంతంలో కొత్తగా ప్రారంభమైన కిళంబాక్కం బస్ టెర్మినల్ నుంచి 2,900 ఎంటీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. దక్షిణాది జిల్లాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు గత నెల 31 వ తేదీ నుంచి ఈ బస్ టెర్మినల్ నుంచే నడుస్తున్నాయి. ఈ బస్టాండ్‌కు వచ్చే వారు చెన్నైలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేలా 2,900 ఎంటీసీ బస్సులు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

తగ్గిన వాణిజ్య సిలిండర్ ధరలు

పెరంబూర్, జనవరి 1: వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.4.50 తగ్గాయి. ఆ ప్రకారం, 19 కిలోల బరువున్న వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.1,929 నుంచి రూ.1,925.50కి తగ్గింది. అదే సమయంలో వంట గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేకుండా రూ.918.50కి విక్రయమవుతోంది.

స్థిరంగా పెట్రో ధరలు

చెన్నైలో 590వ రోజుగా పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఆ ప్రకారం, పెట్రోల్ లీటరు రూ.102.63, డీజిల్ లీటరు రూ.94.24కు విక్రయమవుతోందని వ్యాపారులు తెలిపారు.

కన్నియాకుమారిలో సూర్యోదయ వీక్షణకు

పోటెత్తిన పర్యాటకులు

చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా తొలి సూర్యోదయాన్ని వీక్షించేందుకు సోమవారం వేకువజాము వేలాదిమంది పర్యాటకులు త్రివేణి సంగమం వద్ద గుమికూడారు. వేకువజాము 5 గంటలకే సముద్రతీరం వద్ద వేలాదిమంది సూర్యోదయాన్ని చూడటానికి పెద్ద సంఖ్యలో గుమికూడారు. అయితే ఆకాశం మేఘావృతం కావటంతో ఉదయం ఆరు గంటలు దాటినా సూర్యభగవానుడిని వీక్షించలేకపోయారు. చివరకు ఏడు గంటలకు మబ్బుల మాటునుండి తొంగి చూసిన సూర్యుడిని చూసి పర్యాటకులు పెద్దపెట్టును హ్యాపీ న్యూఇయర్ అంటూ కేకలు పెట్టారు. ఒకరినొకరు కరచాలనం చేసుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



త్రివేణి సంగమం వద్ద సూర్యోదయ వీక్షణకు గుమికూడిన పర్యాటకులు

ఊటీలో...

నీలగిరి జిల్లా ఊటీలోనూ ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా దేశవిదేశాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఆదివారం అర్ధరాత్రి ఊటీ, కున్నూరు, గూడలూరు ప్రాంతాల్లోని రెస్టారెంట్లు, హోటళ్లలో బసచేసి నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఆటపాటలతో సందడి చేవారు. గతేడాది కంటే ఈయేడాది ఊటీ, కున్నూరు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు రావడంతో దుకాణాల్లో కొనుగోళ్లు కూడ పెరిగాయి. మంగళవారం ఉదయం ఊటీ బొటానికల్ గార్డెన్, రోజ్ గార్డెన్, బోట్ హౌస్ తదితర ప్రాంతాల్లో పర్యాటకులు ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదించారు. వేకువజాము ఊటీ, కున్నూరు, గూడలూరు ప్రాంతాల్లో మంచువర్షం కురిసింది. అ తర్వాత ఉదయం ఎనిమిది గంటల తర్వాతే సూర్యకిరణాలు ప్రసరించడంతో ఆ వాతావరణానికి పర్యాటకులు ముగ్ధులయ్యారు.



ఊటీ సరస్సులో పడవ సవారీ

పళని ఆలయంలో...

ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సుప్రసిద్ధ పళని దండాయుధపాణి ఆలయంలో వేలసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజామునే పర్వతాలయం పైకి వెళ్లి స్వామివారి దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. ఉదయం ఆరు తర్వాత సర్వదర్శనం క్యూలో వేలసంఖ్యలో భక్తులు వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం పూర్తి చేసుకున్న తర్వాత భక్తులు పంచామృతం తదితర ప్రసాదాలను కొనేందుకు బారులు తీరారు.



పళని దండాయుధపాణి ఆలయం వద్ద రద్దీ

తెలుగు చర్చిల్లో ఆంగ్ల సంవత్సరాది సంబరాలు

ప్యారీస్, జనవరి 1: ఆంగ్ల సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నగరంలోని తెలుగు చర్చీలు వెలుగులు విరజిమ్మాయి. విశ్వశాంతిని కాంక్షిస్తూ నిర్వహించిన ప్రార్థనలకు క్రైస్తవులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. విజయాలతో 2024లో అడుగుపెట్టాలని, సమాజానికి ప్రభావితం చేసే అంశాలతో క్రైస్తవులు ముందుకెళ్లాని పాస్టర్లు బోధించారు.

వెప్పేరిలో...

వెప్పేరి హైరోడ్డులోని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎంసీటీబీసీ)లో సంఘకాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఆరాధనకు అనుబంధ సంఘాల నిర్వాహకులు, వివిధ కమిటీల సభ్యులు, సండే స్కూలు, యూత్, స్త్రీల సమాజం నిర్వాహకులు పాల్గొన్నారు. సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్ ప్రకటన మేరకు, సంఘం తరపున అనుబంధ సంఘాలున్న ప్రాంతాల్లోని వితంతువులు, పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు గాలి మట్టి రామయ్య, కోశాధికారి అనమలగుర్తి బాబు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



వెప్పేరిలో పేదలకు వస్త్రాలు అందిస్తున్న రెవరెండ్ రాజేంద్రప్రసాద్

పెరంబూర్‌లో...

పెరంబూర్ కుక్స్ రోడ్డులో ఉన్న వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో సంఘకాపరి రెవరెండ్ డాక్టర్ పాల్ ఈశ్వరప్ప అధ్యక్షతన నూతన సంవత్సర దివ్యారాధన జరిగింది. ఈ సందర్భంగా యూత్, సంగీత బృందం, సీనియర్ సభ్యులకు, స్త్రీల సమాజం నిర్వాహకులకు బహుమతులు పంపిణీ చేశారు. అసిస్టెంట్ పాస్టర్ రెవరెండ్ ఆర్.ఆరోన్‌దయాళ్, వైస్ ప్రెసిడెంట్ బీఏస్ జీవన్‌బాబు, కార్యదర్శి జి.నాగేశ్వరరావు, కోశాధికారి ఎన్.పాల్ నాగేశ్వరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పెరంబూర్‌లో సంఘ నిర్వాహకులకు డైరీలు అందిస్తున్న సీనియర్ పాస్టర్ పాల్ ఈశ్వరప్ప

గణేశ్‌పురంలో...

గణేశ్‌పురం ఎంకేఎం నగర్‌లో ఉన్న ఈసీఐ సెయింట్ పీటర్స్ తెలుగు చర్చిలో సంఘకాపరి రెవరెండ్ డి.బాలరాజ్ అధ్యక్షతన జరుపుకున్న ఆంగ్ల సంవత్సరాది సంబరాల్లో చెన్నై మిస్సా చర్చి కాపరి రెవరెండ్ మద్దూరి ఆదాము పాల్గొని దైవసందేశం అందించారు. నూతన సంవత్సరంలో విలువైన ఆశయాలతో ముందుకు సాగాలని ఆయన బోధించారు. ఉమెన్ ఫెలోషిప్, చర్చి యూత్, సండేస్కూల్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.



గణేశ్‌పురంలో సంఘ సభ్యులతో పాస్టర్ డి.బాల్‌రాజు, పాస్టర్ మద్దూరి ఆదాము

కామరాజ్ నగర్‌లో...



కామరాజ్‌నగర్‌లో నూతన సంవత్సరం కానుకగా మహిళలకు చీరలు అందిస్తున్న పాస్టర్ జడ వసంతబాబు

కొరుక్కుపేట కామరాజ్ నగర్‌లో ఉన్న సీబీఎఫ్ సంఘంలో సంఘకాపరి రెవరెండ్ జడ వసంతబాబు అధ్యక్షతన నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా హిజ్రాలు, పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేసి ప్రేమ విందు ఏర్పాటుచేశారు. బ్లెస్సీ ఇవాంజలికల్ అండ్ సోషల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి జడ విశ్వవాణి, సంఘ నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాసర్పాడిలో...

వ్యాసర్పాడి జేజేఆర్ నగర్ క్రీస్తు సంఘంలో సీనియర్ పాస్టర్ డి.దినకర్ నేతృత్వంలో ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని చిన్నపిల్లలకు బహుమతులు, మహిళలకు చీరలు, విద్యార్థులకు డైరీలు, సభ్యులందరికీ వాగ్దానం కార్డులను కానుకలుగా అందజేశారు.



వ్యాసర్పాడిలో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న పాస్టర్ దినకర్



రామ్‌రాజ్ కాటన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తిరుపత్తూరులో 'ధోవతి వారోత్సవాలు' ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ వ్యవస్థాపకుడు కేఆర్ నాగరాజన్, మేనేజింగ్ డైరెక్టర్ బీఆర్ అరుణ్ ఈశ్వర్, ముఖ్య అధికారులు, సిబ్బంది తదితరులు



ఫీనిక్స్ మార్కెట్ సిటీలో ఆదివారం నూతన సంవత్సర వేడుకల్లో సందడి చేస్తున్న సూపర్‌సింగర్ ప్రతినిధులు ప్రియాంక ఎన్, నిఖిల్ మాథ్యూ

సీఎం భద్రతకు కొత్త ఇన్నోవా కార్లు

పెరంబూర్, జనవరి 1: ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భద్రత కోసం ఆరు కొత్త ఇన్నోవా క్రిస్టా నలుపు రంగు కార్లు కొనుగోలు చేశారు. ఈ కార్లు సోమవారం నుంచి సీఎం కాన్వాయ్‌లో వినియోగించారు. అత్యాధునిక కెమెరాలు, జామర్ పరికరం, కమాండోలు వాహనం వెలుపల నిలబడి వెళ్లే విధంగా ప్రత్యేక వసతి తదితరాలు ఈ కొత్త కార్లకు ఉన్నాయని అధికారులు తెలిపారు.

మేట్టూరు డ్యాంకు ఇన్‌ఫ్లో

పెరంబూర్, జనవరి 1: కావేరి పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గడం, కర్ణాటక డ్యాం నుంచి నీటి విడుదల నిలిపివేయడంతో సేలం జిల్లాలోని మేట్టూరు డ్యాం నీటి రాక తగ్గింది. సోమవారం గణాంకాల ప్రకారం డ్యాంకు 807 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, తాగునీటి అవసరాలకు డ్యాం నుంచి 250 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 71.27 అడుగులు (33.80 టీఎంసీలు) నీటి నిల్వ ఉన్నాయని అధికారులు తెలిపారు.

జీర్ణోద్ధరణ పనుల పేరుతో ఆలయాల ప్రాచీనత్వానికి భంగం

● మాజీ ఐజీ పొన్ మాణిక్యవేల్ ఆరోపణ



చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జీర్ణోద్ధరణ పనుల పేరిట సుప్రసిద్ధ ఆలయాల ప్రాచీనత్వాన్ని మంటగలుపుతున్నారని రాష్ట్ర విగ్రహాల నిరోధక విభాగం మాజీ ఐజీ పొన్‌మాణిక్యవేల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోడ్‌లో ఆదివారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆలయాలకు జీర్ణోద్ధరణ పనులు జరుపుతున్నామంటూ గొప్పలు చెప్పుకుంటోందని, వాస్తవానికి ఆ పనుల పేరిట ఆలయాల ప్రాచీనత్వాన్ని నాశనం చేస్తోందని మండిపడ్డారు. ఇందుకు నిదర్శనమే పళని దండాయుధపాణి ఆలయంలో మరమ్మతులు జరిపి అక్కడి 16 శతాబ్దం నాటి శిలాశాసనాలను నాశనం చేయడమన్నారు. ఆలయాలకు జీర్ణోద్ధరణ పనులు చేసే అధికారం రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖకు లేదని, సుప్రసిద్ధ ఆలయాలకు రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖ మాత్రమే జీర్ణోద్ధరణ పనులు జరపాలని ఆయన చెప్పారు. ఆలయాలలో అన్ని పనులను జరిపేది అర్చకులేనని, వారిని కాపాడుకోక పోతే ఆలయాలన్నీ కనుమరుగైపోతాయన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందితే నేరాలు తగ్గుముఖం పడతాయని, ఇళ్లల్లో ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రాచీన వైష్ణవ, శైవ ఆలయాలకు చెందిన ప్రాచీన కాలపు ఆస్తుల ద్వారా యేటా రూ.28 కోట్ల మేరకు రాబడి వస్తోందని, ఆ రాబడిలో కోటి రూపాయలను మాత్రమే ప్రభుత్వం తీసుకుని మిగత సొమ్మును ఆలయ నిర్వాహకులకే అందించాలన్నారు. 12 వేలమంది అర్చకులకు ప్రతినెలా వెయ్యి రూపాయల జీతాన్ని కూడా ప్రభుత్వం సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు. ఆలయాలకు చెందిన 22,600 ఎకరాల స్థలాల ద్వారా రూ.151 కోట్ల మేరకు ఎనిమిది నెలల అద్దె బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో ఐదువేలకు పైగా ప్రాచీన ఆలయాలకు జీర్ణోద్ధరణ పనులు జరిపినట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, ఆ పనుల్లో భారీగా ముడుపులు, కమిషన్లు అంటూ అవినీతి జరిగిందని ఆరోపించారు. వచ్చే పదిహేనేళ్లలో 26 వేల ఆలయాల్లో అర్చకులు ఉండరని, అర్చకులను కాపాడుకోవాలంటే వారికి సక్రమంగా జీతాలు చెల్లించాలన్నారు. 2012లో అమెరికా నుంచి 2,622 విగ్రహాలను తీసుకురాగలిగామని, అయితే అంతకు మునుపు ఇంతటి స్థాయిలో అక్రమరవాణాకు గురైన ప్రాచీన విగ్రహాలను స్వస్థలాలకు తరలించలేకపోయారన్నారు. కేంద్రప్రభుత్వంతో సంప్రదించి, అమెరికాలో ఉన్న ప్రాచీన విగ్రహాలను తెప్పించేందుకు ఆ దేశ పోలీసుల సహకారాన్ని కోరాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్ల మృతి




కార్తీక, పేరాసి (ఫైల్ ఫొటోలు)

పెరంబూర్, జనవరి 1: ఆంబూరు సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెళ్ల మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. తిరుపత్తూర్ జిల్లా జోలార్‌పేట సమీపం పెరియకమ్మియంపట్టుకు చెందిన రైతు పరంధామన్, భార్య కావేరి, ముగ్గురు పిల్లలతో ద్విచక్రవాహనంపై ఆంబూరు సమీపంలోని అంజనేయస్వామి గుడికి బయల్దేరాడు. ఆంబూరు సమీపం మారాపట్టు వద్ద బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో వెళ్తున్న లారీ మలుపు తిరుగుతుండగా, వెనుకగా ఉన్న ద్విచక్రవాహనం లారీని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న కార్తీక (8), పేరాసి (5) లారీ చక్రాల కింద చిక్కుకొని సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, పరంధామన్, కావేరి, పెద్ద కుమార్తె ఇళవరసి స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఆంబూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను వాణియంబాడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసి పరారైన లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

నీట మునిగి....

తూత్తుకుడి జిల్లా తరువైకుళం మేల్‌మరుదూర్‌కు చెందిన మారియప్పన్ కుమార్తె కలైసెల్వి(19), నాగరాజన్ కుమార్తె కనిసెల్వి (19), మేనకాదేవి (14) ముగ్గురు ఆదివారం సాయంత్రం గ్రామ శివార్లలో ఉన్న చెక్‌డ్యాం వద్దకు స్నానాలకు వెళ్లారు. లోతైన ప్రాంతానికి వెళ్లి కలైసెల్వి నీట మునగడం గమనించిన మేనకాదేవి, కనిసెల్వి ఆమెను రక్షించేందుకు యత్నించారు. ఈ ఘటనలో కలైసెల్వి, మేనకాదేవి నీటమునిగి మృతిచెందగా, ప్రాణాలతో పోరాడుతున్న కనిసెల్విని చుట్టుపక్కల వారు రక్షించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తరువైకుళం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఐటీ ఉద్యోగి మృతి



మంటల్లో చిక్కుకున్న బైక్, మహమ్మద్ షాట్

పెరంబూర్, జనవరి 1: తిరువణ్ణామలై జిల్లాలో బైక్‌పై వెళ్తూ డివైడర్ ఢీకొని మంటలు వ్యాపించడంతో ఓ ఐటీ ఉద్యోగి సజీవ దహనమయ్యాడు. బెంగళూరులోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్న మహమ్మద్ షాట్ (23) సహా ముగ్గురు స్నేహితులు వేర్వేరు ద్విచక్రవాహనాల్లో పుదుచ్చేరికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. తిరువణ్ణామలై జిల్లా కీళ్‌పెన్నాత్తూర్ సమీపంలోని బైపాస్ రోడ్డు మీదుగా వస్తున్న సమయంలో మహమ్మద్ షాట్ నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని సుమారు 10 మీటర్ల దూరం రోడ్డుపై రాసుకుంటూ వెళ్లింది. ఆ సమయంలో ట్యాంక్‌లోని పెట్రోల్ లీక్ కావడంతో మంటలు చెలరేగి మహమ్మద్ షాట్ సజీవ దహనమయ్యాడు. ఈ ఘటనపై కీళ్‌పెన్నాత్తూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బీచ్‌లో గల్లంతైన నలుగురి మృతదేహాలు లభ్యం

పెరంబూర్,జనవరి1: పుదుచ్చేరి బీచ్‌లో గల్లంతైన నలుగురి మృతదేహాలు సోమవారం తీరానికి కొట్టుకొచ్చాయి. నూతనసంవత్సరం సందర్భంగా ఆదివారం సముద్ర తీరంలో స్నానాలకు అనుమతించని పోలీసులు, తీరం వెంబడి బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. అయినా కొందరు బ్యారికేడ్లు దాటి స్నానాలు చేస్తుండడంతో పోలీసులు వారిని హెచ్చరించి పంపుతున్నారు. ఈ నేపథ్యంలో, మధ్యాహ్నం సమయంలో నెల్లితోపు టీఆర్‌నగర్‌కు చెందిన శ్రీనివాసన్, మీనాక్షి దంపతుల కుమార్తెలు లేఖ (15), మోహన (17) పాత హార్బర్ సమీపంలోని బీచ్‌లో స్నానం చేస్తుండగా, మీనాక్షి తీరంపై కూర్చుని వారిని గమనిస్తోంది. అదే ప్రాంతంలో కదిర్‌గామం ప్రాంతానికి చెందిన 12వ తరగతి విద్యార్థి నవీన్ (16), అతని స్నేహితుడు కిషోర్ (16) కూడా స్నానం చేస్తున్నారు. ఆ సమయంలో ఊహించని విధంగా వచ్చిన భారీ అల తాకిడికి నలుగురు సముద్రంలోకి కొట్టుకుపోయారు. మీనాక్షి కేకలకు చుట్టుపక్కల వారు, పోలీసులు, కోస్ట్ గార్డ్ సిబ్బంది ఆ ప్రాంతంలో గాలించినా ఫలితం లేకపోయింది. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేసిన పోలీసులు, సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ క్రమంలో, వీరాంపట్టి తీరానికి సోమవారం ఉదయం లేఖ మృతదేహం కొట్టుకురాగా, వేర్వురు ప్రాంతాల్లో మిగిలిన మృతదేహాలు కొట్టుకొచ్చాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధం

ఎండీఎంకే అధినేత ఎంపీ వైగో



సమావేశంలో మాట్లాడుతున్న వైగో

ప్యారీస్, జనవరి 1: పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి, ఎంపీ వైగో పేర్కొన్నారు. ఎగ్మూర్‌లోని ఎండీఎంకే ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వైగో మాట్లాడుతూ... ఏడాదిన్నరగా కేంద్రప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను పాటిస్తూ ప్రజాస్వామ్యాన్ని కుప్పకూల్చిందన్నారు. దీనిపై ఆగ్రహంగా ఉన్న ప్రజలు రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గత ఎన్నికల సందర్భంగా బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తోందని వైగో మండిపడ్డారు.

మేల్‌మరువత్తూర్‌లో విశేషపూజలు



ప్యారీస్, జనవరి 1: చెంగల్పట్టు జిల్లా మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి క్షేత్రంలో నూతన సంవత్సరం సందర్భంగా విశేషపూజలు జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అర్చనలు నిర్వహించి, ప్రతి ఇంటా వెలుగులు నిండాలని ప్రార్థించారు. ఆలయ ప్రధాన నిర్వాహకురాలు లక్ష్మీ బంగారు అడిగళార్ ప్రారంభించిన హోమగుండం ఆదిపరాశక్తి భక్తులు పాల్గొన్నారు.

10 మంది ఐపీఎస్ అధికారులకు డీఐజీలుగా పదోన్నతి

పెరంబూర్, జనవరి 1: డీఐజీలుగా పదోన్నతి కల్పిస్తూ 10 మంది ఐపీఎస్ అధికారులకు రాష్ట్రప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పీఆర్ వెన్‌మది, పి.అరవిందన్, వి.విక్రమన్, సరోజ్‌కుమార్ ఠాగూర్, డి.మహేష్‌కుమార్, ఎన్.దేవరాణి, ఈఎస్ ఉమ, ఆర్. తిరునావుక్కరసు, ఆర్.జయంతి, జి.రామర్‌లకు పదోన్నతులు పొందారు. అలాగే, ఆనందకుమార్ సోమణి, ఆర్.తమిళ్‌చంద్రన్ తదితరులు ఏడీజీపీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక ప్రస్తుతం డీఐజీలుగా పనిచేస్తున్న జయశ్రీ, చాముండేశ్వరి, లక్ష్మి, రాజేశ్వరి, రాజేంద్రన్, ముత్తుస్వామి, మయిల్‌వాహనన్ తదితరులు ఐజీగా పదోన్నతులు పొందారు.

తిరుమల ఘాట్‌లో కారు బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడిన తమిళనాడు భక్తులు



తిరుమల, జవవరి 1(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో సోమ వారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘట నలో తమిళనాడుకు చెందిన భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కాంచీపురానికి చెందిన ఆనందమురుగన్ కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. దర్శనం ముగించుకుని సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఘాట్ 30వ మలుపు వద్ద కారు అదుపు తప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొని లోయలో బోల్తా పడింది. కారులోని నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారును టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది తొలగించారు.

ఆనంద షిర్డీసాయి ఆలయంలో కల్పతరువు వేడుకలు



చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని అరుళ్‌మిగు నందవన ఆనంద షిర్డీసాయి ఆలయంలో, అరుళ్‌మిగు నందవన ఆనందనాయకి సమేత ఆనందీశన్ ఆలయంలో ఆంగ్ల సంవత్సరాది, కల్పతరువు దిన వేడుకలు సోమవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నలభై రకాలైన సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అష్టోత్తర శత (108) క్షీర శంఖాలతోనూ అభిషేకం నిర్వహించారు. నవవిధ ఫలాలు, నవవిధ పుష్పాలతో దేవతామూర్తులను అలంకరించారు. ఆ తర్వాత భక్తులకు నవధాన్య వినాయకుడు, ఆరుగోమతిచక్రాలు, కుబేర, కామధేను, కల్పతరు చిత్రపటాలను, ప్రసాదాలను పంపిణీ చేశారు.


'కెప్టెన్ మిల్లర్'లో ధనుష్

'కెప్టెన్ మిల్లర్'కు యూఏ సర్టిఫికెట్

● 12న విడుదల

హీరో ధనుష్ - డైరెక్టర్ అరుణ్ మాదేశ్వరన్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకున్న 'కెప్టెన్ మిల్లర్'కు సెన్సార్ బోర్డు "యూఏ" సర్టిఫికెట్‌ను మంజూరు చేసింది. ఈనెల 12వ తేదీన సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదలకానుంది. ఇప్పటివరకు ధనుష్ నటించిన చిత్రాల్లోకెల్లా భారీ బడ్జెట్‌తో తెరకెక్కించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. సీనియర్ నిర్మాత టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానరుపై నిర్మాతలు సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ సంయుక్తంగా నిర్మించారు. ప్రియాంక అరుళ్ మోహనన్, నివేదిత సతీష్, జాన్ కొక్కన్, సురేష్ మూర్, వినాయగన్ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ గౌరవ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది.

అభిమానులకు రజనీకాంత్ శుభాకాంక్షలు


అభిమానులకు రజనీకాంత్ అభివాదం

ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని తన నివాసం వద్దకు వచ్చిన అభిమానులకు సూపర్‌స్టార్ రజనీకాంత్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక తేనాంపేటలోని పోయెస్ గార్డెన్‌లో సోమవారం వేకువజాము నుంచే ఆయన అభిమానులు భారీ సంఖ్యలో గుమికూడారు. దీంతో ఆయన ఉదయం 9.30 గంటల సమయంలో ఆయన తన నివాసం ప్రధాన గేటు వద్దకు వచ్చి అభిమానులకు శుభాకాంక్షలు తెలిపి, అభివాదం చేశారు. తెల్లటి దుస్తులు ధరించిన ఆయన... ఇంటి గేటు వెనుక నిల్చొని రెండు చేతులు జోడించి అభివాదం చేశారు. ఆ తర్వాత గాలిలో ముద్దులు పెడుతూ అభిమానులను ఉత్సాహపరుస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం రోజున తమ అభిమాన హీరోను చూడగానే ఫ్యాన్స్ కేరింతలు కొడుతూ 'తలైవా.. తలైవా' అంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపు అభిమానులను ఉత్సాహపరుస్తూ నిల్చొండిపోయిన ఆయన... ఆ తర్వాత ఇంటిలోకి వెళ్లిపోయారు. అలాగే, అభిమానులు కూడా అక్కడ నుంచి తిరుగుముఖం పట్టారు.

చిత్రజ్యోతి

'కయల్' ఆనంది ప్రధాన పాత్రలో 'మంగై'



జేఎస్ఎం పిక్చర్స్ పతాకంపై నిర్మాత ఏఆర్ జాఫర్ నిర్మాణ సారథ్యంలో కయల్ ఆనంది ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'మంగై'. కుబేంద్రన్ కామాచ్చి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ దర్శకులు వెట్రిమారన్, అమీర్, నటుడు విజయ్ సేతుపతి కొత్త సంవత్సరం సందర్భంగా విడుదల చేశారు. అమీర్ ప్రధాన పాత్రలో ఏఆర్ జాఫర్ 'ఇరైవన్ మిగ పెరియవన్' అనే పేరుతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెల్సిందే. ఇపుడు, హీరోయిన్ ప్రధాన పాత్రలో 'మంగై' పేరుతో ఈ చిత్మాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ... 'ఇది ఒక మహిళ జీవన ప్రయాణాన్ని వివరించే చిత్రం. మున్నార్, పూంపార్రై, కేరళ, తేని, కంభం, గూడలూరు, లోయర్ క్యాంపు, చెన్నై తదితర ప్రాంతాల్లో చిత్రీకరించాం. శశికుమార్ నటించిన 'ఈసన్' సినిమాలో కీలక పాత్రను పోషించిన దుషి ఇందులో ముఖ్య పాత్రను పోషించారు. నిర్మాణాంతర కార్యక్రమాలను పూర్తి చేసి, ఫిబ్రవరిలో ఆడియో, ట్రైలర్‌ను రిలీజ్ చేసి, మార్చి నెలలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం' అని వివరించారు.

'కెప్టెన్' కాలం కోలీవుడ్‌కు స్వర్ణయుగం

● సాక్షి అగర్వాల్



దివంగత కెప్టెన్ విజయకాంత్ క్రియాశీలకంగా ఉన్న సమయం కోలీవుడ్‌కు స్వర్ణయుగం వంటిదని హీరోయిన్ సాక్షి అగర్వాల్ అన్నారు. అలాంటి వ్యక్తి ఇకలేరన్న వార్తను జీర్ణించుకోలేక పోతున్నట్టు చెప్పారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ... 'కెప్టెన్ విజయకాంత్ సార్‌కు ఇలాంటి దుస్థితి ఏర్పడుతుందని ఊహించలేదు. కొన్నేళ్లపాటు ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించి, మమ్మల్ని కూడా ముందుకు నడిపిస్తారని భావించాం. కానీ, ఆయన లేరనే వార్తను ఎన్నటికీ జీర్ణించుకోలేనిది. నా విషయానికి వస్తే నేనే ఒక యువనటిని. సీనియర్ నటీనటులు విజయకాంత్ గురించి అనేక విషయాలు చెప్పారు. ఆయన ఎలాంటి మంచి మనిషనే విషయం తెలుసుకోవచ్చు. వాటిని ఒక్కసారి తలచుకుంటే, విజయకాంత్ ఉన్న సమయం కోలీవుడ్‌కు ఒక స్వర్ణయుగం వంటిది. షూటింగ్ లొకేషన్‌లో లైట్‌మేన్ నుంచి హీరో వరకు ప్రతి ఒక్కరినీ సమానంగా చూసుకునేవారు. ఇపుడు ఆయన భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన ఆశీర్వాదం, దీవెనలు మాత్రం మాకు ఉంటాయి' అని పేర్కొన్నారు.





శ్రీవారి ఆలయంలో పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటున్న సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, మాజీ అధ్యక్షుడు ఎన్.శ్రీకృష్ణ - శ్రీవారి ఆలయంలో బారులు తీరిన భక్తులు - ప్రత్యేక అలంకరణలో పార్థసారథి స్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

కొత్త సంవత్సరంలో ఆధ్యాత్మిక శోభ




ప్యారీస్, జనవరి 1: కొత్త సంవత్సరం రోజున చెన్నైలో ఆధ్యాత్మికత శోభిల్లింది. అత్యధికులు ఆలయాలు, చర్చిలు, మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాత సంవత్సరంలో చెడును కొత్త సంవత్సరంలో పునరావృతం కానీయరాదని, మున్ముందు అంతా మంచే జరగాలంటూ దేవుడిని వేడుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

స్థానిక టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులో ఉన్న టీటీడీ సమాచార కేంద్రంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం ముందు ఏర్పాటుచేసిన క్యూలైన్‌లలో అర్ధరాత్రి నుంచే వేచి ఉన్న భక్తులను తెల్లవారుజామున 3.30 గంటల నుంచి దర్శనానికి అనుమతించారు. పద్మావతి అమ్మవారు సమేత శ్రీవారిని దర్శించుకున్న భక్తులు నూతన సంవత్సరంలో తమ జీవితాల్లో ఆనందాలు వెల్లివిరియాలని ప్రార్థించారు. ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సుమారు 1,000 కిలోలకు పైగా రకరకాల పుష్పాలతో, పండ్లు, తోరణాలు, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు దర్శనం కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో వెంకటనారాయణ రోడ్డు కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు బ్యారీకేడ్లు ఏర్పాటు చేయడమే కాకుండా బందోబస్తు నిర్వహించారు. స్థానిక సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, ఉపాధ్యక్షులు, సభ్యులు డిప్యూటీ ఈవో, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులందరికి ప్రసాదాలు పంపిణీ చేశారు. సలహామండలి మాజీ అధ్యక్షుడు నూతలపాటి శ్రీకృష్ణ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.


శాంథోమ్ చర్చిలో భక్తుల ప్రార్థనలు

ట్రిప్లికేన్‌లో...

ట్రిప్లికేన్ నియోజకవర్గంలో పురాతనమైన పార్థసారథి స్వామి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు ఆలయాన్ని తెరచి ప్రత్యేక పూజలు చేపట్టారు. నూతన సంవత్సరంలో స్వామివారి దర్శనార్థం అర్ధరాత్రి నుంచే ఆలయం ముందు భక్తులు పెద్దసంఖ్యలో గుమిగూడారు. ఈసారి మహిళలు, పిల్లలు, వృద్ధులు పెద్దసంఖ్యలో క్యూలైన్‌లలో వేచి ఉండి దర్శనం చేసుకున్నారు. అలాగే, మైలాపూర్ కపాలేశ్వర ఆలయంలో కూడా ఉదయం 5 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. శివాచార్యులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వడపళనిలో ప్రసిద్ధిచెందిన మురుగన్ ఆలయంలో కొత్త ఏడాదిని పురస్కరించుకొని ఆలయ యాజమాన్యం భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి బంగారు నాణేలతో అలంకరించి చేసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బంగారు నాణేల అలంకారంతో స్వామివారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోయంబేడులో ఉన్న కురుంగాలీశ్వర ఆలయం, ప్యారీస్‌లో ఉన్న కందకోట మురుగన్ ఆలయం, జార్జిటౌన్‌లో ఉన్న రంగనాథస్వామి ఆలయం, మింట్ వీధిలోని ఏకాంబరేశ్వర ఆలయం, తిరువొత్తియూర్ వడివుడిఅమ్మన్ ఆలయం, బిసెంట్ నగర్ అష్టలక్ష్మి ఆలయం, అడయార్ అనంతపద్మనాభ స్వామి ఆలయం, పాడి శివాలయం, తిరుముల్లైవాయల్‌లో ఉన్న పచ్చయమ్మన్ మన్నాదీశ్వర ఆలయాల్లో ప్రత్యేక అభిషేక ఆరాధనలు నిర్వహించారు. తిరువేర్కాడు కరుమారి అమ్మన్ ఆలయం, మాంగాడు కామాక్షి అమ్మన్ ఆలయం, కుండ్రత్తూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం, నంగనల్లూర్ ఆంజనేయ స్వామి ఆలయం, మడిపాక్కం పాతాళ వినాయకస్వామి ఆలయం, పురుషవాక్కం గంగాదీశ్వర ఆలయాలు సహా నగరంలోని అన్ని ఆలయాలను భక్తులు సందర్శించి తమకు అంతా శుభాలే చేకూరాలని ప్రార్థించారు.

చర్చిల్లో...

నూతన సంవత్సరాదిని ఆహ్వానిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన చర్చిల్లో ఆదివారం అర్ధరాత్రి 1 గంట వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నాగపట్టినం జిల్లాలో ప్రసిద్ధి చెందిన వేలాంకన్ని మేరీమాత ఆలయంలో ఫాదర్లు ప్రపంచంలో శాంతి సౌభాగ్యాలు నెలకొనాలని ప్రార్థించారు. సెయింట్ జేవియర్ ఆడిటోరియంలో తంజావూరు జిల్లా బిషప్ సహాయరాజ్ నేతృత్వంలో ఫాదర్లు ఇరుదయరాజ్, అర్పుతరాజ్ నేతృత్వంలో జ్యోతి వెలిగించి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో వేలాంకన్ని దివ్యక్షేత్రం కిటకిటలాడింది. ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు పరస్పరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. తిరుచ్చిలో ప్రసిద్ధిచెందిన రీ డీమర్ చర్చి, సెయింట్ సెబాస్టియన్ చర్చి, తిరువారూర్ జిల్లా పూండి మేరీమాత ఆలయం, చెన్నై బిసెంట్‌నగర్ వేలాంకన్ని ఆలయం, శాంథోమ్ చర్చి, సెయింట్ థామస్ మౌంట్ చర్చి, ప్యారీస్ సెయింట్ ఆంటోని చర్చి, పెరంబూర్ సెయింట్ పీటర్స్ చర్చి, జెమిని సర్కిల్‌లోని కెథడ్రల్ చర్చి సహా సీఎస్ఐ, ఈసీఐ, మారనాత తదితర చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు పాల్గొన్నారు. ఆయా దేవలయాలు, చర్చిల వద్ద పోలీసులు భద్రత కల్పించారు.


ట్రిప్లికేన్‌లో స్వామివారి దర్శనం కోసం వేచివున్న భక్తజన సందోహం - మెరీనాతీరంలో నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న క్షణాల్లో ప్రజల కేరింతలు

ప్రాణహాని లేని ఆంగ్ల సంవత్సరాది...

రాజధాని నగరంలో 2024 సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ప్రాణహాని లేకుండా వేడుకలు జరుపుకోవడంపై గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ భద్రతా విధుల్లో పాల్గొన్న పోలీసులను, నగర ప్రజలను ప్రశంసించారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు కొత్త సంవత్సరం వేడుకల్లో పాల్గొనేందుకు ప్రజలను అనుమతించారు. అదే విధంగా ప్రమాదాలు అరికట్టే విధంగా మెరీనా బీచ్ రోడ్డు సహా ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలు పాక్షికంగా నిషేధించారు. ముఖ్యంగా, మెరీనా బీచ్, బిసెంట్ నగర్ ఎలియట్స్ బీచ్, పట్టణంబాక్కం బీచ్, రాయపురం, కాశిమేడు తదితర సముద్రతీరాల్లో గస్తీ ముమ్మరం చేశారు. సముద్రంలో స్నానాలు చేయకుండా భద్రత కట్టుదిట్టం చేశారు. పబ్‌లు, రిసార్టులు, స్టార్ హోటళ్లలో సందడి నెలకొంది. కాగా, కమర్షియల్ ఈవెంట్ల వద్ద గట్టి నిఘా ఏర్పాటైంది. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రంగంలో దిగిన బృందాలు వాహనచోదకుల వద్ద డ్రగ్ డిటెక్షన్ టెస్ట్ నిర్వహించారు. మరోవైపు యువత బైక్ రేస్‌లో పాల్గొనకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.


సోమవారం నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని చెన్నై టి.నగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన సీఎం స్టాలిన్ సతీమణి దుర్గాస్టాలిన్‌కు ప్రసాదాలు అందిస్తున్న ఆలయ డీఈవో విజయకుమార్, సూపరింటెండెంట్ జీవీ సుమతి తదితరులు









మెరీనాతీరంలో కొత్త ఏడాదిలోకి అడుగిడుతున్న క్షణాల్లో ప్రజల కేరింతలు


వండలూర్ పార్కును సందర్శించిన 15,690 మంది

పెరంబూర్, జనవరి 1: స్థానిక వండలూర్ పార్కును నూతన సంవత్సరం సందర్భంగా 15,690 మంది సందర్శించారు. ఈ పార్కులో వివిధ రకాలకు చెందిన సుమారు 2 వేలకు పైగా జంతువులు, పక్షులు, మొసళ్లు, పాములు తదితరాలున్నాయి. ఈ నేపథ్యంలో, సోమవారం ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకొని సెలవు రోజు కావడంతో పిల్లలతో పాటు పెద్దలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జంతువుల సమీపంలో పిల్లలు సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు. అలాగే, పార్కు ప్రాంగణంలో అద్దెకు అందించే సైకిళ్లను తీసుకున్న చిన్నారులు పార్కు మొత్తం చుట్టి వచ్చారు.